క్లుప్తంగా

బడి బయట పిల్లలను గుర్తించాలి



కాకుమాను: బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను గుర్తించి, వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా కృషి చేయాలని ఎంపీడీఓ పి.రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరు బడిలో ఉండే విధంగా అధికారులతో పాటు తల్లిదండ్రులు కూడా కృషి చేయాలన్నారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉందని, చిన్నారులను తల్లిదండ్రులు కూలి పనులకు పంపకుండా మంచి బాటలో నడిపించాలని ఆయన తెలిపారు. ఈ కార్యదర్శులు, వీఆర్వోలు ప్రతి రోజు ఆయా గ్రామాలలో తిరిగి బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దారు పార్వతి, ఎంఈఓలు కేఎఫ్.కెనడీ, విజయ్ భాస్కర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీజిల్ జనరేటర్ కోసం సీల్డ్ టెండర్ ఆహ్వానం

గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ ఫర్ మైనారిటీస్ కళాశాలలో ఏదైనా ప్రమాణికమైన సంస్థ నుంచి తయారైన 5-5.5 కేవీఏ డీజిల్ జనరేటర్ కోసం సీల్డు టెండర్‌ను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ పి.రాజశేఖరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్లను ఈ నెల 26 దీ నుంచి 29వ తేదీ వరకు ఉదయం 10-30 నుంచి సాయంత్రం 4-30 గంటల వరకూ స్వీకరిస్తారన్నారు. సీల్డ్ టెండర్లను జులై 1న మధ్యాహ్నం 2-30 గంటలకు ఓపెన్ చేయడం జరుగుతుందన్నారు. వివరాలకు 99123 42096, 9985 480199 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

బొల్లి వ్యాధిపై అవగాహన ర్యాలీ



గుంటూరు మెడికల్: ప్రపంచ బొల్లి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ డెర్మటాలజీ, వెనిరియాలజీ, లెప్రాలజీ అసోసియేషన్ గుంటూరు, రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో స్థానిక బృందావన్‌గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడియం నుంచి లక్ష్మీపురం మదర్‌థెరిసా విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ అత్తోట కవిత మాట్లాడుతూ బొల్లి అంటు వ్యాధి కాదని, చర్మంలో నెలోసైట్ కణాలు తగ్గడం వలన వస్తుందని తెలిపారు. వ్యాధి నివారణకు అన్ని రకాల మందులు, పూత మందులు, ఫొటోథెరఫీ చికిత్సలు, సర్జరీల, లేజర్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వ్యాధి మొదలైనప్పుడే చర్మవ్యాధుల వైద్యులను సంప్రదిస్తే పూర్తిగా నివారించవచ్చు అన్నారు. వివాహం చేసుకోవడానికి బొల్లి మచ్చలు ఏమాత్రం అడ్డు కాదన్నారు. ర్యాలీలో సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జె.సౌజన్య, డాక్టర్ సీతారామ్, డాక్టర్ ఎ.శిరీష, డాక్టర్ టి.వాణి, డాక్టర్ సౌమ్య, డాక్టర్ షకీల, డాక్టర్ మన్నెసింధూర, డాక్టర్ నాగేశ్వరమ్మ, డాక్టర్ నీలిమ, లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు లాల్‌వజీర్, పాల్గొన్నారు.

విద్యార్థికి బొమ్మిడాల ట్రస్ట్ ఆర్థిక సాయం



గుంటూరు ఎడ్యుకేషన్: గేట్‌లో జాతీయస్థాయిలో సాధించిన రెండో ర్యాంకు ఆధారంగా ముంబై ఐఐటీలో ఎంటెక్ సీటు పొందిన అద్దంకి పట్టణానికి చెందిన ఘంటసాల రవితేజకు బొమ్మిడాల భానుమూర్తి ట్రస్ట్ చైర్మన్ బొమ్మిడాల భానుమూర్తి సెమిస్టర్‌కు రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేసేందుకు ముందుకు వచ్చారు. సోమవారం కాకానిరోడ్డులోని ట్రస్ట్ కార్యాలయంలో విద్యార్థి రవితేజకు రూ.లక్ష చెక్కు అందజేశారు. ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కృషి చేసిన ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, అవోపా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శి పొట్టి శ్రీరాములు, గాంధీ క్లబ్స్ చైర్మన్ బంగారుబాబు, కొలిశెట్టి సతీష్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

ఫిరంగిపురం: సమస్యలు సత్వరమే పరిష్కరించాలని తహసీల్దారు రాఘవేంద్రరావు అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మూడు ఫిర్యాదులు అందినట్లు తహసీల్దారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విమాదేవి, డీటీవో రాజా రమేష్ పాల్గొన్నారు.

సమస్యల సముదాయాలు



ఖాళీగా ఉన్న కూరగాయల మార్కెట్‌లోని దుకాణాలు



ఖాళీగా ఉన్న సెంటరులోని దుకాణాలు

- అస్తవ్యస్తంగా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ అద్దె గదుల నిర్వహణ
- ఏటా రూ.కోటి ఆదాయం.. పేరుకుపోతున్న బకాయిలు
- పొన్నూరు పురపాలిక ఆదాయానికి భారీగా గండి
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారులు



ప్రధాన సెంటరులోని మున్సిపల్ కాంప్లెక్స్

పొన్నూరు: పురపాలక సంఘ ఖజానాకు ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటైన దుకాణ సముదాయాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. ఖాళీగా ఉన్న దుకాణాలకు టెండర్లు నిర్వహించి లీజుదారులకు కేటాయించడం, కేటాయించిన దుకాణాలకు అద్దెను సకాలంలో రాబట్టు కోవడంలో రెవెన్యూ విభాగాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పొన్నూరు పట్టణంలో నాలుగు షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో 140 దుకాణాలు పురపాలక సంఘ పరిధిలో ఉన్నాయి. వీటి ద్వారా ఏడాదికి రూ. కోటి అద్దెల రూపంలో రావాల్సి ఉంది. కానీ అంత మొత్తంలో వసూలు చేయలేకపోతున్నారు. ఖాళీగా ఉన్న దుకాణాలకు టెండర్లు నిర్వహించి, లీజుదారులకు కేటాయించి అద్దె రూపంలో ఆదాయం సమకూర్చుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది.

రూ. 30 లక్షలకు పైగా బకాయిలే..

పురపాలక దుకాణ సముదాయాల్లో వ్యాపారాలు చేసుకునేవారు అనేక మంది వివిధ కారణాలతో గత రెండు మూడేళ్లుగా అద్దెలు సక్రమంగా చెల్లించలేదు. సుమారు రూ. 30 లక్షలు బకాయిలు పేరుకుపోయాయి. అంతా ఆన్‌లైన్ ప్రక్రియే. నెలకు రూ.100కు రూ.2 చొప్పున జీఎస్టీతో కలిపి వడ్డీ అద్దెలో కలుస్తుంటుంది. దీంతో వ్యాపారులు కొన్నేళ్లపాటు దుకాణాలు మూసేసి తాళాలు వేసి ఉన్నా అసలు, వడ్డీ తడిసి మోపెడవుతోంది. రెన్యువల్ చేసే విషయంలోను, బహిరంగ వేలంపాటలు నిర్వహించాల్సిన ప్రక్రియలోనూ అవకతవకలున్నాయనే ఆరోపణలూ ఉన్నాయి.

మరమ్మతులు చేయరు..

నెలకు రూ.వేలల్లో అద్దె గుంజుకునే పురపాలక సంఘం దుకాణ సముదాయాల్లో వ్యాపారాలు చేసుకునే వారికి కనీస సౌకర్యాలు కల్పించడం లేదని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. పురపాలక సంఘ పరిధిలోని మున్సిపల్ దుకాణాలకు గతేడాది నవంబరులో బహిరంగ వేలం నిర్వహించారు. అయితే ఎన్నిసార్లు టెండర్లు పిలిచినా వ్యయ ప్రయాసే తప్ప ఫలితం లభించడం లేదు. దుకాణాల కేటాయింపులు పూర్తిస్థాయిలో జరగడం లేదు. టెండర్లలో పాల్గొనేవారు దుకాణాలను తీసుకునేందుకు సాహసించడం లేదు. అద్దెలు ఎక్కువ, సౌకర్యాలు తక్కువగా ఉండటంతో లీజుదారులు ముందుకురావడం లేదని చెబుతున్నారు. కాంప్లెక్స్‌లకు దశాబ్దాలు గడిచినా కనీసం చిన్న చిన్న మరమ్మతులు కూడా చేయించకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. ఉన్నతాధికారులు స్పందించి సముదాయాలకు మరమ్మతులు చేసి పురపాలికకు ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నోటీసులు జారీ చేస్తున్నాం

మున్సిపల్ కాంప్లెక్స్‌లలో శిథిలావస్థకు చేరిన దుకాణల మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకుఎన్నోసార్లు తెలియజేశాం . కానీ వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. మున్సిపల్ దుకాణాలకు సంబంధించి సకాలంలో అద్దె చెల్లించని వారికి నోటీసులు జారీ చేస్తున్నాం. అద్దె చెల్లింపు ఆలస్యం చేస్తే మొదటి నెల నుంచే జీఎస్టీతో కలిపి రూ.2 వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అద్దె వసూలు సకాలంలో చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– తోట వెంకటేశ్వరరావు, మున్సిపల్ రెవెన్యూ అధికారి, పొన్నూరు.

వైభవంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

నగరంపాలెం: స్థానిక ఎస్‌వీఎస్ కాలనీ పద్మావతి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహం, అగ్నిధ్యానం, నిత్య హోమం, నవగ్రహారాధన హోమం, వెంకటేశ్వర మూలమంత్ర హోమం, చక్రస్నానం, యాగ పూర్ణాహుతి వంటి కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆలయానికి విచ్చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం వేళ ధ్వజావరోహణ, ద్వాదశ ప్రదక్షిణాలు, పవళింపు సేవ కార్యక్రమాలను భక్తి ప్రపత్తులతో జరిగాయి. ఆలయ అధ్యక్షులు వట్టికూటి పూర్ణచంద్రరావు, కార్యదర్శి నల్లమోతు రత్తయ్య, కోశాధికారి పుచ్చ వెంకట మల్లేశ్వర్, ఉపాధ్యక్షులు పావులూరి కిషోర్, సంయుక్త కార్యదర్శి ఇమ్మడి శ్రీనివాసరావు, నైషధం శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన బ్రహ్మోత్సవాలు

నగరంపాలెం: స్థానిక కృష్ణనగర్ ఒకటో వీధిలోని గోదా పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నవ దశ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారానికి రెండో రోజుకి చేరాయి. ఉదయం నిత్య పూజలు, నిత్య హోమం, ధ్వజస్తంభం వద్ద వైనతేయునికి విశేష పూజలు నిర్వహించారు. ధ్వజారోహణ వేదమంత్రాల నడుమ మేళతాళాలతో భక్తిశ్రద్ధలతో జరిగాయి. సాయంత్రం విష్ణుసహస్ర నామ పారాయణ , నిత్య హోమాలు చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించగా, ధనకుదరం శ్రీనివాసాచార్యులు, అర్చకులు పాల్గొన్నారు.



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి



నిత్య హోమం

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మహా నగర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు జి.సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో ఉన్నతంగా ఎదగడానికి సరైన ప్రణాళిక ద్వారా ఇష్టంతో చదవాలన్నారు. మిరియాల సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, నైపుణ్యంతో విజయబావుటా ఎగురవేయాలని ఆకాంక్షించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ ఎస్కే.రసూల్ పాఠశాలలోని విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఉపాధ్యాయులు జోజప్ప, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బాజాలు మోగేది శ్రావణంలోనే!

- ఏప్రిల్ 28 నుంచి నిలచిన శుభకార్యాలు
- వరుసగా శుక్ర, గురు మౌఢ్యమిలు రాక
- ఆగస్టు 7 తరువాతే వివాహాలు, గృహ ప్రవేశాలు

ఏ కార్యం తలపెట్టినా దానికి మంచి లగ్నం, శుభ ఘడియలు చూసుకోవడం హిందువుల సంప్రదాయం. కొత్త ఇంట్లోకి అడుగుపెట్టాలన్నా, పిల్లలకు పెళ్లిళ్లు చేయాలన్నా, నూతన గృహానికి శ్రీకారం చుట్టాలన్నా అందరూ చూసుకునేది ముహూర్త బలమే. రెండు మాసాలుగా అటువంటి ముహూర్తాలకు విరామం లభించింది. మరో నెల పాటు ఆ ముహూర్తాల జాడ(ఆషాఢ మాసం) కానరాదు. రానున్న ఆగస్టు నెలలో వచ్చే శ్రావణ మాసం వస్తే తప్ప అందరి ఇళ్లకు పచ్చటి తోరణాలు, బాజభజంత్రీలు మోగే అవకాశం ఉండదు.



కల్యాణ మండపంలో డెకరేషన్ చేసిన దృశ్యం

నెహ్రూనగర్: క్రోధి నామ సంవత్సరంలో ఏప్రిల్ తొమ్మిదో తేదీ నుంచి ముహూర్తాలు ప్రారంభమై 26వ తేదీ వరకు నడిచాయి. ఏప్రిల్ 28 నుంచి జూలై ఎనిమిదో తేదీ వరకు శుక్ర మౌఢ్యమి(మూఢం) నడుస్తోంది. అలాగే మే 7వ తేదీ నుంచి జూన్ ఏడో తేదీ వరకు గురు మౌఢ్యమి. వరసగా గురు, శుక్ర మౌఢ్యములు రావడంతో రెండు నెలలుగా శుభకార్యాలకు ఆటంకం ఏర్పడింది. మరోవైపు జూలై 5వ తేదీ నుంచి ఆషాఢ మాసం ప్రారంభమై ఆగస్టు ఐదో తేదీ వరకూ కొనసాగుతుంది. ఇది శూన్యమాసం కావడంతో ఈ నెలలో కూడా వివాహాలు, ఉపనయనాలు, గృహప్రవేశాలు వంటి శుభ కార్యాలు నిర్వహించరు. ఏప్రిల్ 28 నుంచి ఆగస్టు ఐదో తేదీ వరకూ పెళ్లి భాజాలు, ఏ ఇతర శుభకార్యాలు జరిగే అవకాశం లేదని పండితులు, పురోహితులు చెబుతున్నారు. మూఢంలో కేవలం అన్న ప్రాసన, అక్షరాభ్యాసం, నామకరణం, నూతన వ్యాపారాల ప్రారంభోత్సవాలు, సీమంతాలు, రిజిస్ట్రేషన్ల వంటివి చేసుకోవచ్చని పండితులు సూచిస్తున్నారు. అలాగే సెప్టెంబర్ నాలుగో తేదీ నుంచి అక్టోబర్ మూడో తేదీ వరకూ భాద్రపదం కూడా శూన్యమాసమే కావడం వల్ల ఆ సమయంలోనూ శుభముహూర్తాలు ఉండవని చెబుతున్నారు.

శ్రావణ మాసంలోనే..

శ్రావణ మాసం ఆగస్టు ఏడో తేదీ నుంచి ప్రారంభమై సెప్టెంబర్ 3వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ నెలలోనే దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. వాటిలో 12, 13, 19, 20, 26, 27 తేదీల్లో శుక్ర, మంగళవారాలు మినహా అన్నీ రోజులూ దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు.

ఉపాధికి దెబ్బ

గత రెండు నెలలుగా వివాహ ముహూర్తాలకు మూఢాలు అడ్డంకి కావడంతో వందలాది మంది ఉపాధిపై తీవ్ర ప్రభావం పడింది. కల్యాణ మండపాలు, కేటరింగ్, వంటవారు, పురోహితులు, ఫొటో, వీడియో గ్రాఫర్స్, ట్రావెల్స్ కార్లు, బస్సులు, మినరల్ వాటర్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, పూలు, డెకరేషన్ లైటింగ్, కూరగాయలు, కిరాణం, వస్త్ర, బంగారు, వెండి ఆభరణాలు, షామియానాలు, హోటళ్లు, లాడ్జీలతో పాటు సాంస్కృతిక కళాకారులకు పని కరువైంది. మరి ఎంతో మంది రోజు వారీ కూలీలకు ఉపాధి లేకుండా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

శ్రావణం వరకు ఆగాల్సిందే



గురు, శుక్ర మౌఢ్యాలు వరుసగా రావడంతో వివాహాలు, ఉపనయనాలు, గృహప్రవేశాలు నిలిచిపోయాయి. ఏప్రిల్ నెల చివరి నుంచి వివాహాలకు కొంత కాలం ముహూర్తాలు లేవు. శ్రావణ మాసంలో ఆగస్టు 7 నుంచి 28వ తేదీ వరకు నాలుగైదు రోజులు మినహా దివ్యమైన ముహూర్తాలున్నాయి. మళ్లీ భద్రపద మాసం కూడా శుభకార్యాలు ఉండవు.

– ఏకా సాయి భరద్వాజ్, అర్చకుడు, గుంటూరు

అన్ సీజన్ వల్ల ఇబ్బందులు



లైటింగ్, డెకరేషన్, టెంట్ హౌస్, ఆర్కెస్ట్రా, శుభకార్యాల మీద ఆధారపడి పనిచేసే అన్ని వర్గాల వారు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పనులు తప్ప వేరే పనులు చేసుకోలేక ఇళ్లకే పరిమితమవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ఆగస్టులో కొన్ని ముహూర్తాలు ఉన్నాయి. అప్పటి వరకు వేచి చూడాల్సిందే.

– మేడా ప్రభుకుమార్, ఫ్లవర్ డెకరేషన్, గుంటూరు

వసూళ్లు వీడి.. ప్రజా సేవపై దృష్టి పెట్టాలి

ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్



శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌ను మందలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు: పొన్నూరు మున్సిపాలిటీలోని అన్ని విభాగాలు అవినీతిమయం అయ్యాయని, ఇకపై అధికారులు పనితీరు మార్చుకోవాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ హెచ్చరించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారుల పనితీరుపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసేందుకు ప్రభుత్వం జీతాలు అందిస్తోందని, కానీ ప్రజలను పట్టిపీడిస్తూ కలెక్షన్ల కోసం అధికారులు పనిచేయడం సిగ్గుచేటన్నారు. గతంలో కన్నా మున్సిపాలిటీ ఆదాయం పెరిగిందని, విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ అభివృద్ధి పనుల్లో నాణ్యతను విస్మరించారన్నారు. రోడ్ల నిర్మాణం, సైడు కాల్వల పనులు అధ్వాన్నంగా ఉన్నాయని, పదేళ్ల పాటు ఉండే విధంగా నాణ్యతతో కూడిన నిర్మాణాలు చేయాలని ఆదేశించారు. కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని శానిటరీ ఇన్‌స్పెక్టర్ తిరుమలశెట్టి ప్రసాద్‌ను మందలించారు. డ్వాక్రా సభ్యులకు రుణాలందించే మెప్మా విభాగం అవినీతి మెప్మాగా పేరుగాంచిందని పేర్కొన్నారు. టౌన్ ప్లానింగ్‌లో అవినీతికి హద్దుల్లేవని, డబ్బులిస్తే ఎన్ని అంతస్తులు కట్టినా కళ్లు మూసుకుపోతాయని ఆరోపించారు. మున్సిపల్ కమీషనర్‌తోనే శాఖలో మార్పు మొదలు కావాలని, ఆ మార్పుతోనే క్రిందిస్థాయి సిబ్బందిలో మార్పు వస్తుందన్నారు. పట్టణంలోని 31 వార్డులలో పరిపాలనా సౌలభ్యం కోసం ఏర్పాటైన సచివాలయాలలో పనిచేసే 170 మంది సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలందించి, సకాలంలో వారి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్, డీఈ ఏడుకొండలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా జలవనరుల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



విద్యార్థులకు కిట్ అందజేస్తున్న షేక్ అబ్దుల్ అజీజ్, హెచ్‌ఎం హుస్సేన్

పెదకాకాని: విద్యాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని పాతూరు మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల మాజీ చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ అన్నారు. పెదకాకాని ఉర్దూ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాల, బూట్లతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ప్రభుత్వం దూరదృష్టితో విద్యకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ ఎండీ హుస్సేన్ చేస్తున్న కృషిని అభినందించారు పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు వంట గది నిర్మాణంలో ప్రధానోపాధ్యాయులు చూపిన చొరవను ప్రతి ఒక్కరూ అభినందించాలన్నారు. హెచ్‌ఎం హుస్సేన్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో విద్య ఉండాలని అప్పుడే సమాజం అభివృద్ధికి నాంది అవుతుందన్నారు. పాఠశాల ప్రధాన రహదారి గేటును ఏర్పాటు చయాల్సి ఉందన్నారు.

ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసల్ సిస్టం(పీజీఆర్ఎస్)కు ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలను విభాగాల వారిగా విభజించి, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, అర్జీలు రీ ఓపెన్ అయితే విభాగాధిపతే నేరుగా క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడుతూ ప్రతి సోమవారం అందే ఫిర్యాదుల పరిష్కార నివేదికను తదుపరి వారం జరిగే సమావేశంలో అందించాలన్నారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారిగా అర్జీల పరిష్కారానికై ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని సూచించారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలని కోరారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారిగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 47 ఫిర్యాదులు రాగా పట్టణ ప్రణాళిక విభాగానికి 14, ఇంజినీరింగ్ విభాగానికి 16, రెవెన్యూ విభాగానికి 1, ప్రజారోగ్య విభాగానికి 11, ఉపా సెల్ విభాగానికి 4, అకౌంట్స్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు.

పూడికతీత పనులపై శ్రద్ధ పెట్టాలి..

తొలుత నగరంలోని ప్రధాన అవుట్ ఫాల్ డ్రైన్లు, ఇంటర్నల్ డ్రైన్‌లలో జరుగుతున్న పూడిక తీత పనులను డీఈఈల వారీగా సమీక్షించి, వర్షాలకు నగరంలో ఎక్కడ నీరు నిలబడినా ఇంజినీరింగ్ అధికారులదే బాధ్యత అని, నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవడానికి అవసరమైన ప్రతిపాదనలు, అనుమతులు, నూతన కల్వర్ట్‌ల నిర్మాణాలకు ప్రతిపాదనలు 2 రోజుల్లో తీసుకురావాలని కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ఎమినిటి కార్యదర్శులు పూడిక తీత పనులను ముందు, తర్వాత ఫొటోలు తీయాలని, కల్వర్ట్‌ల వద్ద పూడిక తీయడానికి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కాల్వల మీద ఆక్రమణలను పట్టణ ప్రణాళికాధికారులు తొలగించాలని, ప్రజారోగ్య అధికారులు కూడా కాలువల్లో పూడిక, ఆక్రమణలు ఉంటే ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. వీధి దీపాలకు సంబంధించి అందే ఫిర్యాదులు 48 గంటల్లో పరిష్కారం చేయాలని చెప్పారు. తాగునీటి సరఫరా జరిగే సమయంలో తప్పనిసరిగా ప్రతి డివిజన్‌లో శ్యాంపిల్స్ తీసి రిపోర్ట్ అందించాలని ఏఈలను ఆదేశించారు. ఎక్కడైనా తాగునీటి కలుషితం జరిగినా ఏఈలదే బాధ్యత అని హెచ్చరించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ శ్యాం సుందర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, సీఎంఒహెచ్ డాక్టర్ డి.ఆషా, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పార్కింగ్ పనులు చేపట్టాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో పార్కింగ్ పనులు వేగంగా చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్న పార్కింగ్ పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పార్కింగ్ పనులను వేగంగా చేయాలని, అలాగే వర్షం నీరు జీఎంసీ ప్రధాన కార్యాలయం దగ్గర నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, టాయిలెట్స్ కూడా మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఈ రమేష్, ఏఈ రాంబాబు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా దుగ్గిరాలలో శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో పంటను భద్రపరచుకుని నష్టపోయిన బాధిత రైతుల సమావేశం దుగ్గిరాలలోని రైలుపేటలోని టర్మరిక్ అసోసియేషన్ హాల్ నందు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో పంటను భద్రపరుచుకుని నష్టపోయిన రైతులకు క్వింటాకు రూ.12,500 నష్టపరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. అగ్నిప్రమాద సంఘటన జరిగి ఐదు నెలలు దాటుతున్నా ఇప్పటికీ రైతులకు నష్ట పరిహారం చెల్లించకపోవడం బాధాకరమన్నారు. రైతు సంఘం నాయకులు వెంకట్రామయ్య, శివ సాంబిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.